నకిలీలతో జాగ్రత్త

- ఎరువులు, పురుగు మందులపై అప్రమత్తత అవసరం
- తెలుసుకోకుండా కొంటే నష్టపోయినట్టే..
- రసీదు తప్పనిసరి



రావులపాలెంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

రావులపాలెం: ఈ ఎరువులతో పంట దిగుబడి వస్తోంది.. ఏ ఏటా లేని లాభాలు ఆర్జించడం ఖాయం.. పంటలపై ఏ తెగులు వచ్చినా ఈ పురుగు మందు వాడండి.. ఇట్టే పంట తెరుకుంటుందని వ్యాపారులు చెప్పే మాటలను నమ్మి ఒప్పుకుంటే తప్పులో కాలేసినట్టే. నిషేధిత పురుగు మందులు, ఎరువులు కొనుగోలు చేస్తే నష్టపోవడం ఖాయమని వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు సూచిస్తున్నారు. ఎరువుల వ్యాపారులు పంట దిగుబడి అధికంగా వస్తుందని నమ్మించి, అనుమతి లేని వివిధ కంపెనీల కల్తీ ఎరువులు, పురుగు మందులు రైతులకు అంటగట్టే అవకాశం ఉంది. అదే విధంగా అనుమతి లేని దుకాణాలు, దళారుల వద్ద వీటిని కొనుగోలు చేయరాదు. తక్కువ ధరకే మందులు విక్రయిస్తారని, వాటిని కొనుగోలు చేస్తే పంట దిగుబడి తగ్గడంతో పాటు భూసారం దెబ్బతింటుంది. మందుల లేబుళ్లను మొదట పరిశీలించి, అవి ఏ కంపెనీ ఎరువులో లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా? అనే విషయాలను తెలుసుకోవాలి. ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసిన తరువాత తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

కొత్తపేట నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. నియోజకవర్గంలో మొత్తం 25,034 ఎకరాల్లో సాగు జరుగుతుంది. ఆలమూరు 9,000 ఎకరాలు, ఆత్రేయపురం 4,494 ఎకరాలు, రావులపాలెం 4,728 ఎకరాలు, కొత్తపేట 6,812 ఎకరాల్లో సాగు జరుగుతుంది. పంట పొలాలకు ఎరువుల వినియోగం అవసరం కానుంది. దీంతో మార్కెట్‌లోకి నకిలీ ఎరువులు, పురుగు మందులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎరువుల కొనుగోలు చేసే విషయంలో ఒకటికి రెండు సార్లు జాగ్రత్తలు పాటించాలని వారు సూచిస్తున్నారు. అధికారుల సూచనల మేరకు కొనాలని, లేదంటే నిలువునా మోసపోయే అవకాశం ఉందని అంటున్నారు. దుకాణదారులు లైసెన్స్ లేకుండా విక్రయాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలి. మందుల లాట్ నంబర్‌ను బట్టి తయారు చేసిన తేదీని గుర్తించి ఏ కంపెనీ, ఏ రకం వంటి విషయాలను చూడాలి. దుకాణ యజమాని, డీలర్‌తో సంతకాలతో కూడిన బిల్లులను తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా విత్తనాలకు సంబంధించి సంచులపై సీల్ తొలగించినట్లు గుర్తిస్తే వాటిని కొనుగోలు చేయకూడదు.. నకిలీలపై సత్వరం రైతులు అధికారులకు ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో అది వాస్తవమని తేలితే సంబంధిత డీలర్‌పై కేసులు నమోదు చేసి, రైతులకు న్యాయం జరిగేందుకు అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

నకిలీలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



ఎరువుల దుకాణాల్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్టు తమ పరిశీలనలో గుర్తిస్తే దుకాణాల లైసెన్సును రద్దు చేస్తాం. మందులు కొనుగోలు చేసిన రైతులకు డీలర్, దుకాణ యజమాని సంతకాలతో కూడిన బిల్లులను అందజేయాలి. క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. లేదా తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీలో నిర్ధారించిన తరువాతే కొనుగోలు చేయాలి. డబ్బాపై చూపించిన వివరాల ప్రకారమే మందు పిచికారీ చేయాలి. లేదంటే పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. అలాగే పశువులకు, కోళ్ల పాలాలకు, రొయ్యల చెరువులకు ఎరువుల వినియోగించరాదని, అలాంటి వారికి దుకాణదారులు విక్రయాలు చేయరాదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం .

– బి.మీనా వ్యవసాయాధికారి, రావులపాలెం

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి

అంబాజీపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలుగా విధులు నిర్వర్తిస్తున్న వారంత పేద కుటుంబాలకు చెందినవారేనని మాకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులమంటూ తల్లికి వందనం ఇవ్వకపోవడం దారుణమన్నారు. రిటైర్ అయిన వారికి పింఛన్ ఇవ్వడం లేదని, రేషన్‌కార్డు దరఖాస్తు చేస్తే ప్రభుత్వ ఉద్యోగులమని తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో చిరు ఉద్యోగులమైన తమకు అన్ని సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ఘనంగా లంకాలమ్మ జాతర

ముక్కామల: ముక్కామలలో వేంచేసిన గ్రామదేవత లంకాలమ్మ అమ్మవారి జాతరను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన గరగ నృత్యాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారి జాతరను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే తొండవరంలో వేంచేసిన రాజ్యలక్ష్మి అమ్మవారి తీర్థాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

అతిసారపై అప్రమత్తంగా ఉండాలి



లక్కవరం ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ సత్యవాణి, వైద్యాధికారులు

మలికిపురం: ప్రస్తుత సీజన్‌లో అతిసార వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి పేర్కొన్నారు. లక్కవరం పీహెచ్ ఆధ్వర్యంలో సోమవారం అతిసార వ్యాధిపై వైద్యాధికారి, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ పాల్గొని ప్రసంగించారు. వ్యాధి ప్రబలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు భావన, భావన, బి.నరసింహారావు, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బాలికల నృత్య ప్రదర్శన



వాడపల్లి యోగాభ్యాసన వేదికపై బాలికల నృత్య ప్రదర్శన

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం బాలికల నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. యోగాభ్యాసాల కార్యక్రమం పురస్కరించుకుని దేవదాయ–ధర్మాదాయ శాఖ డీసీ, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన నృత్య కళాకారిణులు కూచిపూడి నృత్య రూపకాలను ప్రదర్శించారు. ఆహ్లాదకర వాతావరణంలో ఈ ప్రదర్శన, బాలికల అభినయం విశేషంగా ఆకట్టుకున్నాయి. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు నృత్య కళాకారిణులను అభినందించారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సునీల్‌కుమార్



మామిడికుదురు: మండల రెవెన్యూ అధికారి తహసీల్దార్‌గా పి.సునీల్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాట్రేనికోన తహసీల్దార్‌గా పని చేస్తూ సునీల్‌కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టేందుకు వచ్చిన సునీల్‌కుమార్‌కు ఆఫీసు ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. డిప్యూటీ తహసీల్దార్ శర్మ ఆయనకు కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, పలు విభాగాలకు చెందిన ఉద్యోగులను పరిచయం చేశారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ఐజీవల ఉద్యోగ విరమణ పొందడంతో డీటీ శర్మ ఇంత వరకు ఇక్కడ ఇన్‌ఛార్జ్‌గా విధులు నిర్వహించారు.

అయినవిల్లి తహసీల్దార్‌గా విద్యావతి

అయినవిల్లి: మండల తహసీల్దార్‌గా సిహెచ్ విద్యావతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. విద్యావతి ఇప్పటివరకూ కొత్తూరు ఆర్డీవో కార్యాలయంలో కేఆర్‌సీ తహసీల్దార్‌గా పనిచేసి బదిలీ అయ్యారు. ఇప్పటి వరకూ ఒక్కడ పనిచేసి తహసీల్దార్ సిహెచ్ నాగలక్ష్మమ్మ అమలాపురం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లారు. తొలుత విద్యావతి అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొత్తపేట ఆర్డీవోను మర్యాద పూర్వకంగా కలిశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మొగలిపాలెంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ లలిత

మామిడికుదురు: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీ లలిత సూచించారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆదుర్రు గ్రామ శివారు మొగలిపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు దోమల ద్వారానే వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ వ్యాధుల నివారణకు దోమల వ్యాప్తిని అరికట్టడమే ఏకైక మార్గమని చెప్పారు. ఇంటి పరిసరాల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంట్లో ఉండే కూలర్, ఫ్రిజ్ వెనకాల నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. ఇంటి మేడపై ఉండే టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాల గుల్లలు, నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ డబ్బాల్లో కూడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా అంతం మనతోనే అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ మేల్ కొమ్మూరి ఉమామహేశ్వరావు, ఏఎన్ఎం వైకుంఠ నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి పాలన అట్టర్‌ఫ్లాప్



మలికిపురంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తదితరులు

మలికిపురం: కూటమి ప్రభుత్వ ఏడాది పాలన అట్టర్ ఫ్లాప్ అని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ధ్వజమెత్తారు. ఆయన మలికిపురం పార్టీ ఆఫీస్‌లో సోమవారం ‘జగన్ అంటే నమ్మకం–బాబు అంటే మోసం’ అనే పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం సభలో మాట్లాడారు. చంద్రబాబు సూపర్‌సిక్స్ అంటూ ఊదరకొడుతూ ప్రజలని మభ్యపెడుతున్నారని అన్నారు. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మోసపూరిత పాలన ప్రజలకి చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. రేషన్ వాహనాలు ఆపేశారు, వలంటీర్ల వ్యవస్థ ఆగిపోయాయన్నారు. దళితులపై దాడులు చేస్తున్నా హోంమంత్రి పట్టించు లేదన్నారు. జగన్ పథకాలు ఆపేశామన్న భయం చంద్రబాబులో కనిపిస్తుంది, అందుకే తల్లికి వందనం డబ్బులు వేశారని సూర్యారావు అన్నారు. తల్లికి వందనంలో రెండు వేలు కోత పెట్టి అవి ఎవరికి ఇస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆరాచక పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేపీఎస్ రాజు, పాటి శివకుమార్, రుద్రరాజు చిన్న రాజా, జన శంకరరావు, కట్టా శ్రీనివాసరావు, కుసుమ చంద్రశేఖర్, సూరిశెట్టి బాబీ, గెద్దం రాజ్యలక్ష్మి, కోటిపల్లి ఎస్తేరు రాణి, ఆదాల జానకిరామ్, గుద్ద జాషువా, కంగాట ఏసురత్నం, తాడి సుధీర్, నేతల నాని, గుబ్బల వీర సత్యనారాయణ, ముష్కర్తి త్రిమూర్తులు, మోకా సురేష్, జిల్లెళ్ల ఉదయ్‌కిరణ్, కొల్లాబత్తుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు

పి.గన్నవరం: ఎన్నికల్లో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు, ఇప్పుడు వాటిని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. ‘జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం’ పుస్తకాలను పి.గన్నవరంలోని దేశరాజు సీతారామయ్య లేఅవుట్‌లో సోమవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన విడుదల చేశారు. గన్నవరపు మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు, సూపర్‌సిక్స్ హామీలను అమలు చేసే వరకూ ప్రజల పక్షాన పోరాటం సాగిస్తామన్నారు. తల్లికి వందనం పథకాన్ని అందరికీ అమలు చేయడం లేదని, వివిధ కారణాలతో కోత వేస్తున్నారని అన్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ తదితర ప్రజా ప్రతినిధుల పిల్లలకు ఈ పథకం ఇవ్వపోవడం దారుణమన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, మండపాటి కిరణ్‌కుమార్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్‌లు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని అన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, యన్నాబత్తుల ఆనంద్, మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, జక్కంపూడి వాసు, మద్దుల వరలక్ష్మి, దొమ్మేటి దుర్గారావు, మట్టపర్తి పండు, కొంబత్తుల ఏసుబాబు, కాండ్రేగుల బాబీ, తులా గోపాలకృష్ణ, సరెళ్ల అప్పారావు, నెల్లి దుర్గాప్రసాద్, చెట్ల రామారావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



ర్యాలిలో దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న సిబ్బంది, అర్చకులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో పురాణ ప్రసిద్ధి చెందిన జగన్మోహిని కేశవస్వామి వారి దేవస్థాన అన్నప్రసాద పథకానికి భక్తులు వివిధగా విరాళాలు సమర్పిస్తున్నారు. దానిలో భాగంగా బెంగళూరుకు చెందిన కలిగొట్ల రామకృష్ణ–సీతామహాలక్ష్మి దంపతులు రూ.10,116, హైదరాబాదుకు చెందిన బానోత్ స్రావణ్‌కుమార్–జయలక్ష్మి దంపతులు రూ.25,116, ర్యాలికి చెందిన దాడి సూర్యనారాయణ–నాగలక్ష్మి దంపతులు రూ.10,200, నూజివీడు మండలం రావిచర్లకు చెందిన లావు ఆనంద దనకోటేశ్వరరావు, హైదరాబాద్‌కు చెందిన మోపిదేవి కృష్ణమోహన్–ఉమాదేవి దంపతులు, విశాఖపట్నానికి చెందిన మాదాబత్తుల యశ్వంత్ రూ.5,116 చొప్పున విరాళాలు సమర్పించినట్టు దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు. ఆయా భక్తుల కుటుంబ సమేతంగా స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలను ఈఓ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆశీర్వచన మండపంలో వేదాశీర్వచనాలతో స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

ఏవోలుగా బాధ్యతల స్వీకరణ



సత్యనారాయణ



కె.ధర్మప్రసాద్



రాజేష్

మామిడికుదురు: మండల వ్యవసాయాధికారి(ఏవో)గా ఎనిమిరి సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అల్లవరం మండలంలో ఏఓగా పని చేస్తూ ఆయన బదిలీపై మామిడికుదురు వచ్చారు. ఏఓగా బాధ్యతలు తీసుకున్న సత్యనారాయణను కార్యాలయ ఉద్యోగులు అభినందించారు. ఏఓ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ వారికి ఉత్తమ సేవలందిస్తానని చెప్పారు. పంటల సాగుపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఇంత వరకు ఇక్కడ ఏఓగా విధులు నిర్వహించిన మద్దుల ఎల్లప్ప బదిలీపై కాట్రేనికోన వెళ్లారు.

అంబాజీపేటకు ధర్మప్రసాద్

అంబాజీపేట: మండల వ్యవసాయాధికారి(ఏవో)గా కె.ధర్మప్రసాద్ ఉద్యోగ బాధ్యతలను సోమవారం స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా అమలాపురం లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. అలాగే ఏఈఓగా జి.శివమోహన్ అల్లవరం నుంచి అంబాజీపేట బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఓ డి.విజయ్‌కుమార్, ఏఈఓ డి.దుర్గారావు బుసార పరీక్ష కేంద్రానికి బదిలీ అయ్యారు.

సఖినేటిపల్లి ఏఓగా రాజేష్

సఖినేటిపల్లి: మండల ఏఓగా ఎస్.రాజేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన నియామకం జరిగింది. ఇంతవరకూ ఇక్కడ ఏఓగా పనిచేసిన వీఎ నరసింహారావు బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లారు. ఈ క్రమంలో మలికిపురం ఏఓగా పనిచేస్తున్న రాజేష్ సఖినేటిపల్లి ఏఓగా బాధ్యతలు తీసుకున్నారు.

వికసిత్ భారత్ సంకల్పంతో ముందంజ



పాశర్లపూడి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వేమా

మామిడికుదురు: భారత ప్రధాని నరేంద్రమోదీ వికసిత్ భారత్ సంకల్పంతో దేశాన్ని ముందంజలో నిలిపారని మాజీ ఎమ్మెల్యే ఎంపీ వేమా తెలిపారు. మామిడికుదురు మండలం పాశర్లపూడిబాడవలో మోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మండల శాఖ అధ్యక్షుడు బొరిశెట్టి దుర్గాకృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: దేశంలో ప్రధాని నరేంద్రమోదీ పాలన అమోఘమని కృష్ణా జిల్లా బీజేపీ ఇన్‌ఛార్జ్ ఉన్నమట్ల కబర్డీ పేర్కొన్నారు. సోమవారం మలికిపురంలో వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మోదీ సంకల్పంతో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ తమలంపూడి రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, అడబాల రాంబాబు, బందుధూరి అమ్మద రామరాజు, మేడిచర్ల చాణక్య తదితరులు పాల్గొన్నారు.

నూతన వాహన చట్ట ప్రకారం జరిమానా

ఆలమూరు: నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడు వేసుకుని వెళుతున్న లారీకి నూతన వాహన చట్ట ప్రకారం జరిమానా విధించారు. ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా రావులపాలెం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు అధిక లోడుతో వెళుతున్న లారీని పోలీసులు గుర్తించారు. ఆ లారీని ఆపి నూతన వాహన చట్ట ప్రకారం రూ.20 వేలు అపరాధ రుసుం విధించారు. దీంతో లారీ యజమాని ఆన్‌లైన్ లో జరిమానా చెల్లించారు. వాహనదారులందరూ నూతన వాహన చట్ట నిబంధనలు పాటించాలని, మితిమీరిన వేగంతో ప్రయాణించవద్దని సీఐ విద్యాసాగర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సచివాలయ ఉద్యోగులపై పక్షపాత వైఖరి సరికాదు

ఆలమూరు: గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో ప్రభుత్వం పక్షపాత వైఖరి సరికాదని మండల యూనియన్ శాఖ ఆవేదన వ్యక్తం చేసింది. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో తక్కువ వేతనానికి పనిచేస్తూ మెరుగైన సేవలను అందిస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో సొంత మండలం కేటాయించకూడదన్న ప్రభుత్వ నిర్ణయం పునరాలోచించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలను అందించామన్నారు.

ప్రతిభా పురస్కార అవార్డు గ్రహీతకు సత్కారం

రాజోలు: ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభా పురస్కార అవార్డు గ్రహీత పాదాలకు చెందిన లిఖితపూడి ప్రవళికను సోమవారం దళిత చైతన్య వేదిక ఆధ్వర్యంలో సత్కరించారు. అంబేద్కర్ విద్యా కుసుమాలు అవార్డు అందజేశారు. అంబేద్కర్ స్ఫూర్తితో దళిత విద్యార్థులు లక్ష్యసాధన కోసం కృషి చేయాలన్నారు. ప్రవళిక తల్లిదండ్రులు లిఖితపూడి బుజ్జి, నాగలక్ష్మి దంపతులను అభినందించారు. దళిత సంఘం జేఏసీ అధ్యక్షుడు మట్టా సురేష్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు పాలమూరి శ్యాంబాబు, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణి వైద్యానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యానికి గురైన గర్భిణికి వైద్యం అందించే నిమిత్తం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.15 వేలు సాయంగా అందజేశారు. కొత్తపేటకు చెందిన సంగా ప్రణీత (19) 7 నెలల గర్భిణి. కొన్ని రోజులుగా క్రితం ఫిట్స్ రావడంతో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అయినా మెరుగుపడకపోవడంతో హైదరాబాద్‌లో ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. ప్రస్తుతం కోమాలో ఉన్నారు. ఇప్పటికే కొంత మంది దాతల సహాయంతో రూ.10 లక్షల వరకు ఖర్చు పెట్టారు. ఇంకా ఖర్చు పెట్టే స్తోమత లేక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో రావులపాలెంలో ప్రణీత తల్లి సాంగ నాగమణికి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.15 వేల చెక్కు అందజేశారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

అయినవిల్లి: ప్రతి రోజూ యోగాసనాలు అభ్యాసం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఆలయ అర్చక సిబ్బంది, కార్యాలయ సిబ్బందితో యోగా గురువులు యోగాసనాలలో శిక్షణ నిచ్చారు.

ప్రతి ఒక్కరూ యోగా అలవాటు చేసుకోవాలి

రావులపాలెం: ఆరోగ్యంగా జీవించేందుకు ప్రతి ఒక్కరూ యోగాను జీవనశైలిలో అలవాటు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సోమవారం కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు యోగాసనాలు వేశారు. యోగా మెడిటేషన్, వ్యాయామం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, పీడీ ఎస్.యమునా, వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు కాదు ప్రధాన రహదారే..



పాశర్లపూడి ఏటిగట్టు దిగువన అప్పనపల్లి మార్గంలో పరిస్థితి

మామిడికుదురు: పాశర్లపూడి నుంచి అప్పనపల్లి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి మీదుగా వెళ్లే ప్రయాణికులు తప్పనిసరిగా ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. పాశర్లపూడి ఏటిగట్టు దిగువన కాజీవే వద్ద గ్రామంలోని చెత్తంతా తీసుకువచ్చి పడేస్తున్నారు. దీంతో ఇక్కడ తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. పైగా చెత్తకు నిప్పు పెట్టడంతో విపరీతమైన పొగ వస్తోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఈ మార్గం మీదుగా అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి నిత్యం భక్తులు వెళ్తుంటారు. ఇక్కడ నెలకొన్న అపారిశుద్ధ్య వాతావరణంతో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. సంపూర్ణ పారిశుద్ధ్యం అంటూ ఊదరగొడుతున్న అధికారులకు ఇక్కడి పరిస్థితి ఏమాత్రం పట్టడం లేదంటూ ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తక్షణం స్పందించి ఇక్కడ నెలకొన్న సమస్యను చక్కదిద్దాలని డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన

కొత్తపేట: ఆత్రేయపురంలో పలు అభివృద్ధి పథకాలకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.20.65 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి, రూ.1.61 కోట్లతో రక్షిత మంచినీటి పథకం రిజర్వాయర్ నిర్మాణానికి, బండారు కాలనీలో 60 వేల లీటర్ల కెపాసిటీ గల రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వాడపల్లిలో ఆత్రేయపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అతిసార వ్యాధి అవగాహనలో ఎమ్మెల్యే బండారు పాల్గొన్నారు. చిన్నారులకు విటమిన్–ఏ డ్రాప్స్ వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎం.దుర్గారావు దొర, డిఐఐఓ వైద్యాధికారి డాక్టర్ ఎం.సుమలత, ఆత్రేయపురం, ర్యాలి పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై నేడు అవగాహన

అయినవిల్లి: పంట భూముల్లో సేంద్రియ కర్బనం పెంచవలసిన ఆవశ్యకతపై, రైతులకు కృషిపల కోకొనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ క్యాయర్ పరిశ్రమ ఆధ్వర్యంలో మండలంలోని నేదునూరులో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సేంద్రియ కార్బన్‌లో జీవన ఎరువుల కలిపి వినియోగించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించడం వంటి అంశాలపై ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మండల రైతులు, పాత్రికేయులు పాల్గొనాలని కృషిపల కోకొనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ సీఈవో అడ్డాల గోపాలకృష్ణ కోరారు.

రావులమ్మకు వెండి ఆభరణాల సమర్పణ



రావులమ్మతల్లికి వెండి ఆభరణాలు అందజేస్తున్న వెంకటేశ్వరరావు దంపతులు

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం గ్రామంలో గ్రామదేవతగా పూజలందుకుంటున్న రావులమ్మ జాతర, తీర్థం సందర్భంగా అదే గ్రామానికి చెందిన ఓదూరి వర్ధరాజు, సత్యవతుల చిన్న కుమారుడు వెంకటేశ్వరరావు(చిన్న) సీతాలక్ష్మి దంపతులు అమ్మవారికి వెండి కిరీటం, నేత్రాలు, కనుబొమ్మలు, నాసికా ఆభరణాలను సోమవారం సమర్పించారు. దాతను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

నేడు అమ్మవార్ల తీర్థం



తొత్తరమూడి ముగురులమ్మ

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి గ్రామంలో ముగురులమ్మ, మాగం కనక మహాలక్ష్మి, మరిడమ్మలకు సోమవారం జాతర మహోత్సవాలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో గరగ నృత్యాలు, చిత్ర విచిత్ర వేషధారణలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అమ్మవార్లకు పెద్ద ఎత్తున భక్తులు దర్శించి కానుకలు మొక్కులు చెల్లించారు. మంగళవారం తీర్థ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

రావులపాలెం: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు మెరుగైన బస్సు సౌకర్యం కల్పించేందుకు మంగళవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ జీజీవీ రమణ సోమవారం తెలిపారు. ప్రయాణికుల ఫిర్యాదులతో పాటు సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు. ఉదయం 11:30 నుంచి 12:30 గంటల మధ్యలో డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. 9959225549, 9959225537 ఫోన్ నంబర్లకు నేరుగా ఫోన్ చేసి సలహాలు, సూచనలు తెలపాలన్నారు.